
రాముడు చారిత్రక పురుషుడా కాదా? రామసేతును నిర్మించడానికి తనేమైనా ఇంజినీరా?
ఇంతకీ నిజంగానే రాముడికి సీత ఏమవుతుంది? చెట్టు చాటు నుంచి వాలిని కూల్చినవాడు దేవుడెలా
అవుతాడు?... ఇవన్నీ హేతువాదుల సందేహాలు! కానీ రాముణ్ని నమ్మేవారి మనసులో ఉన్నవాడు...
సకలగుణాభిరాముడు, మాటకు కట్టుబడినవాడు, ఏకపత్నీవ్రతుడు,
కష్టాలను నిబ్బరంగా దాటినవాడు, శరణు కోరిన వారికి అండగా నిలిచినవాడు... ఆ రాముడిని తలుచుకుని,
కొలుచుకుని, తన విలువల బాటను ఆదర్శంగా మార్చుకునేందుకే ఈ ప్రయత్నం.
ఇంతకీ తన ప్రత్యేకత ఏంటి అన్న ప్రశ్నకు రామాయణంలో ప్రతి మజిలీలోనూ అద్భుతమైన లక్షణాలు కనిపిస్తాయి.

లేకలేక కలిగిన రాముడు... దశరథ మందిరంలో సకల సంపదలు సుఖాల మధ్య పెరిగాడు. అన్ని శాస్త్రాలనూ ఆపోశన పట్టాడు. ఇక తనకు పెళ్లి చేద్దామని దశరథుడు అనుకునే సమయానికి విశ్వామిత్రుడు వచ్చాడు. మారీచసుబాహులనే రాక్షసుల బారినుంచి యజ్ఞాన్ని కాపాడేందుకు రాముడిని తన వెంట పంపమన్నాడు. ఆ మాటలు విన్న దశరథుడి గుండె పగిలింది. కావాలంటే నేను నా చతురంగబలాలతో యుద్ధానికి వస్తానని భరోసా ఇస్తాడు, రాముడు ఇంకా బాలుడనీ కపటయుద్ధం చేతకానివాడనీ వాపోతాడు. కానీ రాముడు మారు మాట్లాడకుండా గురువును అనుసరించాడు. అది తనకు తొలి వనవాసం. అడవిలో తిరిగాడు, అలములు తిన్నాడు, గడ్డి మీద పడుకున్నాడు. దారిపొడవునా విశ్వామిత్రుడి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. ఈ సందర్భమే కాదు... రాముని జీవితం అంతా సవాళ్లను స్వీకరించడమే కనిపిస్తుంది. సీతా స్వయంవరం నుంచి రామసేతు నిర్మాణం వరకు ప్రతి సవాలుకూ సిద్ధపడ్డాడు, వాటిని తన ఎదుగుదలకు అనుగుణంగా మలుచుకున్నాడు



**చేతలే మాటలు!**

ఎదుటివాడు మనల్ని అవమానించడానికి వచ్చాడు, యుద్ధానికి కాలు దువ్వుతున్నాడు. తన మాటలు, చేష్టలు రెచ్చగొడుతున్నాయి. ఇలాంటప్పుడు ఎవరైనా ఏం చేస్తారు? అందులోనూ అరివీరభయంకరుడు, రాకుమారుడు అయినవాడు అభిమానంతో ఎలా స్పందిస్తాడు? కానీ రాముడు అలా కాదు! వీరత్వానికి సైతం సందర్భం ఉంటుందనే విచక్షణ ఉన్నవాడు. అందుకు పరశురాముడితో తన ముఖాముఖి గురించే చెప్పుకోవాలి. రాముడు శివధనుస్సును విరిచాడన్న కోపంతో పరశురాముడు దశరథుడి కోటకు వస్తాడు. తను చూసేందుకు దాటరాని కైలాస పర్వతంలా, సహించలేని కాలాగ్నిలా ఉన్నాడని వాల్మీకి మహర్షి వర్ణిస్తాడు. పరశురాముడు కోపంలో విశ్వామిత్రుడు, దశరథుడితో అవమానకరంగా మాట్లాడతాడు. అందుకు తన తండ్రి బదులు ఇస్తున్నంత సేపూ రాముడు మారు మాట్లాడకుండా ఉంటాడు. జవాబు చెప్పాల్సిన అవకాశం వచ్చిన తర్వాత 'మీ మాటలన్నీ విన్నాను సరే... ఇప్పుడు మీరు నా తేజస్సు, పరాక్రమం చూడాల్సిందే' అంటూ పరశురాముడి చేతి నుంచి విష్ణు ధనుస్సును అందుకుని దాన్ని కూడా ఎక్కుపెట్టి చూపిస్తాడు.

**ధర్మానికి కట్టుబడి**

మంథర మాట విన్న కైకేయి, రామ పట్టాభిషేకాన్ని నిలుపు చేయించింది. పైగా రాముడి అరణ్యవాసానికి పట్టుబట్టింది. అది విన్న దశరథుడు కుప్పకూలాడు కానీ, రాముడు మాత్రం తొట్రుపడలేదు. పైగా ఆ వార్త చెప్పిన కైకతో 'ఓస్ ఇంతే కదా! ఈ విషయాన్ని నాతో చెబితే నేనే భరతుడికి సింహాసనాన్ని ఇచ్చేవాడిని కదా! నాన్నగారితో చెప్పించే ప్రయత్నం చేసి, ఆయన్ని ఎందుకు బాధపెట్టారు?' అని అడుగుతాడు. వనవాసం గురించి తెలుసుకుని బాధలో మునిగిపోయిన తల్లి కౌసల్యనీ, పగతో రగిలిన లక్ష్మణుడినీ శాంతింపచేస్తాడు. ఆ సమయంలో వారిద్దరితో రాముడు అన్న మాటలు ఏ కౌన్సిలింగ్‌కీ తీసిపోవు. ఇక అడవులకు తన వెంట వచ్చేందుకు సిద్ధపడిన సీతమ్మను అక్కడ ఉండే కష్టాలన్నీ వర్ణిస్తూ వారిస్తాడు. అడవిలో కూడా తను సౌకర్యంగా ఉండేందుకు ఏర్పాట్లు చేయబోతే నారచీరలు తప్ప ఇంకేమీ అక్కర్లేదని వారిస్తాడు. చేసిన తప్పునకు కుమిలిపోయిన దశరథుడు ఇంకొక్క రోజు తమతో గడపమని, రాజభోగాలు అనుభవించి వెళ్లమని వేడుకున్నా... 'ఈ భోగాలు ఒక్కరోజు అనుభవిస్తే తృప్తి కలిగించేవి కాదు. మళ్లీమళ్లీ కావాలనిపిస్తాయి' అంటూ అప్పటికప్పుడే బయల్దేరతాడు. కానీ, ఇంత కష్టానికీ తాను సిద్ధపడింది, కేవలం తండ్రి మాట కోసమే! 'తల్లిదండ్రులూ, గురువుని మించిన దైవం లేదు. వారిని నిర్లక్ష్యం చేసి ఇతర దేవతకు పూజలు చేసి ఉపయోగమూ లేదు. అందుకే నా తండ్రి మాట జవదాటక అరణ్యవాసానికి వెళ్తున్నాను' అని సీతతో అంటాడు రాముడు. పైగా నేను అడవికి వెళ్లాక, ఆ దుఃఖం ఆయన ప్రాణాల మీదికి తెస్తుంది కాబట్టి ఆయనను జాగ్రత్తగా కనిపెట్టుకోమని తల్లితో చెబుతాడు. కాలానికి అనుగుణంగా సమాజం ఏర్పరుచుకున్న ధర్మానికి ఎలా కట్టుబడి ఉండాలో ఆచరించి చూపిస్తాడు.



**నిబ్బరంగా, నమ్మకంగా!**

రాముడి అరణ్యవాసం గురించి తెలుసుకున్న భరతుడు మండిపడతాడు. తల్లికి బుద్ధి చెప్పి, రాముణ్ని తిరిగి తెచ్చి పట్టాభిషేకం చేస్తానంటూ బయల్దేరతాడు. అలా బయల్దేరిన భరతుడి వెంట లక్షల మంది పరివారం ఏనుగులు, రథాలు, అశ్వాల మీద వచ్చారు. ఆ జన సమూహాన్ని చూస్తుంటే మహాసముద్రం పొంగుతున్నట్టు ఉందట! అడవిలో ఉన్న రామలక్ష్మణులకు ఈ కోలాహలం వినిపించింది. అదేమిటో తెలుసుకుందామని చెట్టెక్కి చూసిన లక్ష్మణుడి కళ్లు చింతనిప్పులయ్యాయి. 'భరతుడు మనల్ని చంపడానికే సైన్యంతో వస్తున్నాడు. నేను ముందు తనను చంపి నిన్ను రాజును